## మినీకథ



# యాచక సమ్రాట్

స్వామిబిత్తానంద

అది మహానగరం బొంబాయి. ఆ నగరంలో ఒకానొక "పంచతార"హోటల్. పేరు "హోటల్ సామ్రాట్."

ఆ హోటల్ ముఖద్వారం దగ్గర ఒకడుంటాడు. పాపం. అతనికి కాళ్ళు మోకాళ్ళ వరకే వున్నాయి. నడవలేడు. చక్రాల పీట మీద కూచుని వుంటాడు. తెల్ల టెరీ కాటన్ నిక్కరు. ఫారెన్ సిల్కు బనీనూ అతని యూనిఫారం ఆ బనీనుమీద 'లవ్‌మీ' (నన్ను ప్రేమించు) అనే అక్షరాలు ఇంగ్లీషులో వుంటాయి. అతను సంగీతం అంటే చెవి మూసుకుంటాడు (ఎప్పుడూ తన వాక్‌మన్‌లోంచి వచ్చే సంగీతంవింటూ వుంటాడు )

అతన్ని చూస్తే 'ముష్టివాడు' అని ఎవరూ అనుకోరు. నేనూ అనుకోలేదు. చాల రోజుల వరకూ. తరువాత తెల్సింది. అతను ముష్టి వాడు అని ముష్టికూడా వృత్తి అన్నారు. అతనిమీద. అతని వృత్తిమీద జాలికలిగింది.

ధర్మం చేయాలని బుద్ధి పుట్టింది.

కాని— ఎంత ఇవ్వాలి?

మదరాస్‌లో లాగ అయిదుపైసలూ, పది పైసలూ యిస్తే ఎలా? ఇది బొంబాయి. ధరలన్నీ మండిపోతూ వుంటాయి. కనీసం ఓ అర్థరూపాయియిస్తే గౌరవంగా వుంటుందనిపించింది. అతనికి ధర్మం చేయాలని నిర్ణయించుకుని జేబులో చెయ్యి పెట్టిచూస్తే చిల్లరలేదు. ఓ రూపాయినోటు చేతికి వచ్చింది. పోతే పోయింది యిచ్చేయాలనుకున్నాను. ఎందుకంటే ఆరోజే నేనుమదరాస్ వెళ్ళిపోతున్నాను. ధర్మం చేయడానికిగాని అతని బనీను అడుగుతున్నట్టు అతన్ని ప్రేమించడానికిగాని అదే ఆఖరి రోజు. అందుకే రూపాయినోటు అతనికిచ్చి. చాల ఎక్కువ యిచ్చానన్న గర్వంతో. ఓ చిరునవ్వు అతనిమీదకు విసిరేసి ముందుకు కదిలాను.

"సాబ్!" అని పిలిచాడు.

అతను నా వూహ పసిగట్టి. అర్థ రూపాయి మాత్రం తీసుకుని. అర్థరూపాయి నాకు యిచ్చేస్తాడనుకుని వెనక్కి తిరిగి వెళ్ళాను.

"ఏ లేజీయే"అంటూ రూపాయ నోటు నాకు యివ్వబోయాడు.

"ఏవిటిది?" అన్నాను స్వచ్ఛమైన తెలుగులో.

"మీరు తెలుగా? నేను ఎవరనుకుంటున్నారు. రూపాయి ధర్మం చేస్తున్నారు— బోడి రూపాయి— అయిదు రూపాయలకి తక్కువ తీసుకోను" అన్నాడు చాలా నిష్కర్షగా.

"అయిదు రూపాయలే!" అన్నాను ఆశ్చర్యంగా.

"అవును. ఫైవ్‌స్టార్ హోటల్ నీడలో కూచుని అంతకన్న తక్కువ తీసుకుంటే నాకు మర్యాద కాదు. ఇవ్వడం మీకూ మర్యాద కాదు" అన్నట్టు చెప్పాడు.

అప్పటికే అయిదారుగురు టాక్సీ డ్రయివర్లు మూగారు. నా వంక వింతగా చూస్తున్నారు. వాళ్ళదగ్గర నవ్వులపాలు అవకూడదనుకున్నా.

"అయితే యింద" అని అయిదు రూపాయల నోటు యిచ్చాను.

"యింద" అని నేను అంతకుముందు యిచ్చిన రూపాయి నోటు తిరిగి యిచ్చేశాడు ఆ 'యాచక సామ్రాట్!

## 'బుద్ధిజీవి', 'అగాధాల అంచులలో' ప్రశ్నావళి

ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రికలో "బుద్ధిజీవి" (రచన- మైనంపాటి భాస్కర్) "అగాథాల అంచులలో" (రచన— కురుమద్దాలి విజయలక్ష్మి) సీరియల్స్ ప్రచురణ ముగిసింది. ఈ రెండు సీరియల్ నవలలు పాఠకులను విశేషంగా ఆకట్టుకున్నట్టు మా కార్యాలయానికి అధిక సంఖ్యలో వచ్చిన. వస్తున్న ఉత్తరాలు రుజువు చేస్తున్నాయి. సైన్స్‌ఫిక్షన్ నవలలకు క్రొత్త చరిత్ర సృష్టించిన "బుద్ధిజీవి" గురించి; సస్పెన్స్. అడ్వెంచర్. సెంటిమెంట్‌లు కలగలిసి సాంఘిక నవలా ప్రపంచంలో కొత్త సీమల్ని తాకిన "అగాధాల అంచులలో" గురించి ఆలోచనాత్మకమైన పాఠకుల అభిప్రాయాలను దృష్టిలో వుంచుకొని వారి సౌకర్యార్థం 'బుద్ధిజీవి', 'ఆగాధాల అంచులలో' రచయిత(త్రు)లచే ఆంధ్రజ్యోతి సచిత్రవారపత్రికలో పాఠకుల ప్రశ్నలకు సమాధానాలు యిప్పించడానికి సంకల్పించాము. ఈ సీరియల్స్‌పై ప్రశ్నల ద్వారా తమ సందేహాలను నివృత్తి చేసుకోదలచినవారు 'బుద్ధిజీవి. ఆగాధాల అంచులలో' ప్రశ్నావళి. C/o ఎడిటర్. ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక. పోస్టు బాక్సు నెం. 712. విజయవాడ–520 010 చిరునామాకు వెంటనే వ్రాయాలి. —ఎడిటర్

